క్లుప్తంగా

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



ఖైదీలకు సలహాలిస్తున్న వైద్య సిబ్బంది, పోలీసులు

కళ్యాణదుర్గం: ప్రతిఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని వైద్య సిబ్బంది సూచించారు. ఏపీ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో వైద్య సిబ్బంది మంగళవారం కళ్యాణదుర్గంలోని సబ్ జైలులో ఖైదీలకు ఆరోగ్యంపై సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఖైదీలకు టీబీ, హెపటైటిస్ బీపీ, హెచ్ఐవీ పరీక్షలను నిర్వహించారు. జైలు సూపరింటెండెంట్ ధనుంజయ నాయుడు, సిబ్బంది నారాయణరెడ్డి, వైద్య సిబ్బంది రాజు, రమణ, ప్రాజెక్ట్ మేనేజర్ మహేష్, టీబీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శివకుమార్, మాణిక్యరావు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు–1 సచివాలయాన్ని ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. సంక్షేమ పథకాల అమలుపై సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వీఆర్వో పక్కీరప్ప పాల్గొన్నారు.

మెనూ పక్కాగా అమలు చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న బీసీ వెల్ఫేర్ డీడీ

ఉరవకొండ: ప్రభుత్వం సూచించిన షెడ్యూల్ ప్రకారం మెనూ తప్పకుండా పాటించాలని బీసీ వెల్ఫేర్ డీడీ కొమ్ము కొఠారి, ఎంపీపీ చందా చంద్రమ్మ మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులకు సూచించారు. మంగళవారం మండలంలోని ఆమిద్యాల ప్రభుత్వ ఎంపీయూపీ పాఠశాలను ఎంపీడీఓ చంద్రమౌళితో కలసి వారు తనిఖీ చేశారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. జగనన్న విద్యా కానుక కిట్ల పూర్తి స్థాయిలో అందాయా లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

నేడు ఉద్యాన పంటలపై శిక్షణ

కళ్యాణదుర్గం: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఉద్యాన రైతులకు నేషనల్ హార్టికల్చర్ బోర్డు ఆధ్వర్యంలో సంక్షేమ పథకాలు, సేవలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు కో ఆర్డినేటర్ డాక్టర్ రాధాకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ముఖ్యంగా మామిడి, అరటి పంటల్లో చీడపీడలపైన అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యఅతిథులుగా జిల్లా ఉద్యాన శాఖ అధికారి డాక్టర్ రఘునాథ్‌రెడ్డి, నేషనల్ హార్టికల్చర్ బోర్డు రీజినల్ సభ్యుడు ఏకే శర్మ హాజరవుతారన్నారు.


నీటి సంరక్షణ పద్ధతులే కీలకం



మెట్ట వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున

కళ్యాణదుర్గం రూరల్: మెట్ట వ్యవసాయంలో నీటి సంరక్షణ పద్ధతులే కీలకమని కేవీకే సేద్య విభాగపు శాస్త్రవేత్త డాక్టర్ మల్లికార్జున సూచించారు. మండలంలోని దాసంపల్లిలో మంగళవారం మెట్ట సేద్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో వర్షాధారం కింద సాగు చేసే వేరుశనగలో అంతర పంటలుగా కంది, ఆముదం సాళ్ల వద్ద గునపం నాగలితో దుక్కులు చేసుకుని తేమను నిల్వ చేసుకోవాలన్నారు. అనంతరం ఎంపిక చేసిన రైతు పొలాల్లో గునపం నాగలితో లోతు దుక్కి చేసే విధానాన్ని ప్రదర్శించారు. అదేవిధంగా పశు విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.హరిణి మేలు జాతి కోళ్ల రకాలు, వాటి యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. అనంతరం డైరీ ఫారంను సందర్శించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది సుకన్య, రైతులు పాల్గొన్నారు.

రాయదుర్గం ఆస్పత్రిలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ మాధవి, వైద్యులు, నర్సులు

రాయదుర్గంటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఈ నెలలో లక్ష్యానికి మించి 102 సాధారణ కాన్పులు చేసి శభాష్ అనిపించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్, గైనాకాలజిస్ట్ పరిగి మాధవి ఆధ్వర్యంలో మే 26 నుంచి జూన్ 27 నాటికి ఇచ్చిన వంద కాన్పుల లక్ష్యాన్ని అధిగమించి 102 కాన్పులు చేశారు. దీంతో వైద్యులు, నర్సులు, సిబ్బంది మంగళవారం ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా గైనకాలజిస్టు మాట్లాడుతూ గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించి సాధారణ కాన్పు అయ్యేలా చూస్తున్నాం. ఒకవేళ ఏదైనా హైరిస్క్ కేసు ఉంటే అనంతపురానికి రెఫర్ చేస్తున్నాం. ప్రభుత్వాస్పత్రిలో ప్రతి నెలా 70 నుంచి 90 మధ్యలో కాన్పులు జరుగుతున్నాయి. మే నెలలో ఏకంగా 102 కాన్పులు చేశామన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి

- 'గడప గడప'లో విప్ కాపు రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



బొమ్మనహాళ్: ఉప్పరహాళ్‌లో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



వజ్రకరూరు: గంజికుంటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

బొమ్మనహాళ్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఉప్పరహాళ్, సింగానహళ్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి విప్ గ్రామంలో పర్యటించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాల వారు అట్టడుగు స్థాయిలోనే ఉండేవారన్నారు. జగనన్న సీఎం అయ్యాక వారి జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. పేదల అభివృద్ధిని ఓర్వలేని చంద్రబాబు, పచ్చ మీడియా సంక్షేమ పథకాలపై విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో చంద్రబాబు ఆయన తనయుడు లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్ సీఎం జగనన్నపై అనవసరపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఈశ్వరరెడ్డి, సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు యోగేశ్వరరెడ్డి, కృష్ణ, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు కోటేశ్వరరెడ్డి, జయరాంరెడ్డి, వీరన్నగౌడ్, వన్నూరుస్వామి, జి. నాయుడు, అంజినేయులు, తిప్పేస్వామి, దేవన్న, కర్రిబసప్ప, మారుతి, వన్నూరుస్వామి అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలి

వజ్రకరూరు: ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజక వర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి కోరారు. మంగళవారం మండలంలోని గంజికుంట గ్రామంలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో కలసి ఇంటింటికీ సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడు తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కేవలం పచ్చచొక్కాలు వేసుకున్న వారికి మాత్రమే పథకాలు అందేవని గుర్తుచేశారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలసి మాజీ ఎమ్మెల్యే క్షీరాభిషేకం నిర్వ హించారు. గ్రామంలో వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ.14.68 కోట్లు జమైందని మహిళలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, విశ్రాంత వీఆర్వో మల్లికార్జునరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీలు సుశీలారాణి, సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ, గ్రామ సచివాలయ కన్వీనర్ రామాంజనేయులు, మాజీ సర్పంచులు ఆవుల వె oకట్రాముడు, కురుబ లింగన్న, స్థానిక నాయకులు బి.క్రిష్టప్ప, నాగి రె డ్డి, శ్రీకాంత్ రెడ్డి, మల్లిరెడ్డి, శ్రీని వా స్ రెడ్డి, బోయవెంకటేష్, సూర్యనారాయణ, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీ నగర్‌లో బుధవారం ఉదయం 6 గంటలకు, గోనేహాళ్ గ్రామంలో మధ్యాహ్నం 3 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె. ఈశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఇంటింటా సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

బెళుగుప్ప: మండలంలోని తగ్గుపర్తి గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం ఉదయం 8.00 గంటలకు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రామచంద్ర, ఎంపీపీ పెద్దన్న, జెడ్పీటీసీ సభ్యురాలు మమత మంగళవారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిదులు, పార్టీ నాయకులు హాజరు కావాలన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి పౌర్ణమి పురస్కరించుకుని జూలై 2 నుంచి అరుణాచలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక లగ్జరీ బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు డీఎం బాలాజీ దయాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జూలై 2న ఉదయం 6 గంటలకు ఉరవకొండ నుంచి బస్సులు బయలుదేరుతాయన్నారు. దర్శనం అనంతరం అరుణాచలం నుంచి జూలై 3న సాయంత్రం 6 గంటల నుంచి తిరిగి ఉరవకొండకు బయలుదేరుతాయన్నారు. పెద్దలకు రూ.1,570, పిల్లలకు రూ.790 చార్జి ఉంటుందన్నారు. వివరాలకు 9959225861, 7382864181 నంబర్లను సంప్రదించాలన్నారు.

సెల్ఫీల డబ్బారాయుడు 'కాలవ'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: ఐదేళ్లు పాటు ఎమ్మెల్యే, మంత్రిగా ఉండి నియోజవకర్గ అభివృద్ధిని మర్చిపోయి కేవలం దోపిడీకే అధిక ప్రాధాన్యత ఇచ్చిన సెల్ఫీల డబ్బా రాయుడు మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు అని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. మంగళవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు వన్నూరుస్వామి, ఈశ్వరరెడ్డి, సర్పంచ్ పరమేశ్వర, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, మల్లి, సురేష్, వైస్ ఎంపీపీ రమేష్ విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తన అనుచరులైన 27 మంది క్రషర్ యజమానుల టిప్పర్లు, స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టర్ లారీలు తిరిగేందుకే రూ.20 కోట్లతో హీర్దేహాల్ గేటు వద్ద నుంచి నేమకల్లుకు తారు రోడ్డు వేశారు కానీ భక్తులు, ప్రజల కోసం కాదన్నారు. వాళ్ల నుంచి రూ.లక్షల్లో కమీషన్లు వస్తుండడంతోనే రోడ్డు వేశారన్నారు. కంకర మిషన్ల యజమానుల వద్ద రూ.లక్షల్లో డబ్బులు, కంకరను కూడా ఉచితంగా తీసుకుని రోడ్డు వేసిన సంగతి మర్చిపోయావా అని అన్నారు. హీర్దేహాల్ గేటు వద్ద నుంచి డి.హీరేహాళ్ మండల కేంద్రానికి ఎందుకు రోడ్డు వేయలేదో చెప్పాలన్నారు. ఐదేళ్ల పాటు మంత్రిగా ఉండి నేమకల్లు ఆంజినేయస్వామి దేవాలయ అభివృద్ధికి ఒక్క రూపాయి అన్నా ఇచ్చావా అని ప్రశ్నించారు. మా నాయకుడు, ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి 2009లోనే రూ.10 లక్షలు ఆలయ అభివృద్ధికి ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు యోగేశ్వరరెడ్డి, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష' పక్కాగా చేపట్టాలి



రాయదుర్గంటౌన్: మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి



బెళుగుప్ప: సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ కలెక్టర్ శంకరయ్య, జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి

రాయదుర్గంటౌన్/ఉరవకొండ/బెళుగుప్ప/శెట్టూరు/రాయదుర్గం రూరల్/విడపనకల్లు/కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని పక్కాగా చేపట్టాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఆర్డీవో నిషాంత్‌రెడ్డి సూచించారు. రాయదుర్గం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహశీల్దార్ మారుతితో కలసి వారు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం వారు 2,7 సచివాలయాలను తనిఖీ చేశారు. అలాగే ఉరవకొండ మండలంలోని రాకెట్ల, ఆమిద్యాల గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారిణి, బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బుకొఠారి, ఎంపీపీ చందా చంద్రమ్మ, ఎంపీడీఓ చంద్రమౌళి పర్యవేక్షించారు. బెళుగుప్ప మండలంలోని రామసాగరం గ్రామంలో చేపట్టిన జగనన్న సురక్ష ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్, మండల నోడల్ ఆఫీసర్ శంకరయ్య, తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీఓ రామచంద్ర పరిశీలించారు. ఎంఈఓ మల్లారెడ్డి, హౌసింగ్ ఏఈ శివారెడ్డి, సర్పంచ్ రామకృష్ణమ్మ, ఎంపీటీసీ వీరబళ్ళమ్మన్న, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే శెట్టూరు మండలంలోని పెరుగుపాళ్యం, కైరేవు గ్రామ సచివాలయాలలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డిప్యూటీ కలెక్టర్ నీలమయ్య, ఎంపీడీఓ మైథిలీ, డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం మండలంలోని మలకాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్వే చేపట్టారు. ఎంపీపీ విద్యావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు నాగరాజు, మురారి, కెంచానపల్లి బుజ్జి, మాజీ సర్పంచ్ నరసింహప్ప, గోపాల్, ఎర్రిస్వామి, ఉమేష్, జుంజురాంపల్లి హనుమంతరాయుడు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. విడపనకల్లు, కూడేరు మండల్లో జూలై 1 నుంచి 20వ తేదీ వరకు జగనన్న సురక్ష క్యాంపెన్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓలు శ్రీనివాసులు, ముస్తఫాకమల్‌బాషా మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

టీడీపీ ఇన్‌చార్జ్‌కు చేదు అనుభవం

కళ్యాణదుర్గం: టీడీపీ చేపట్టిన 'భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర'లో కళ్యాణదుర్గం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వర నాయుడికి చేదు అనుభవం ఎదురైంది. మంగళవారం రాత్రి టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరి సొంత పంచాయతీ గరుడాపురం వద్ద టీడీపీ హయాంలో తవ్వి అర్ధంతరంగా ఆపేసిన కాలువ పనులను పరిశీలించేందుకు రాష్ట్ర టీడీపీ బృందం, మాజీ ఎమ్మెల్యేలతో కలసి ఆయన బస్సు దిగేందుకు యత్నించాడు. అప్పటికే బస్సు వద్ద సిద్ధంగా ఉన్న మాజీ ఎమ్మె ల్యే ఉన్నం వర్గీయులు 'ఉమా..గో బ్యాక్...బస్సు దిగకూడదు...అలాగే వెనక్కు పో'...అంటూ అడ్డుకున్నా రు. బస్సు యాత్రలో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యేలు సైతం మౌనం వహించడం కొసమెరుపు.

టీడీపీ కార్యకర్త దాడిలో ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గంలో టీడీపీ చేపట్టిన భవిష్యత్తుకు భరోసా బస్సు యాత్ర ఇద్దరు అన్నదమ్ములను ఆసుపత్రి పాలయ్యేలా చేసింది. భట్టువానివీధికి చెందిన ఎరుకుల హరీష్, ఎరుకుల రామాంజనేయులును టీడీపీ నేతలకు సంబంధించిన ఫ్లెక్సీలు కట్టేందుకు టీడీపీ కార్యకర్త ఎరుకుల హరి అదే పార్టీకి చెందిన మంజు వద్ద పనికి ఒప్పించాడు. సోమవారం రాత్రి టీ సర్కిల్‌లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మంజు నుంచి భోజనానికి రూ.500 డబ్బులు తీసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్త ఎరుకుల హరి వారిపై దూషణకు దిగి దాడి చేశాడు. దాడిలో ఎరుకుల హరీష్ తలకు బలమైన గాయాలు కాగా రామాంజనేయులుకు స్వల్ప గాయాలయ్యాయి. హరీష్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

2 నుంచి భీమలింగేశ్వరస్వామి రథోత్సవం

విడపనకల్లు: మండలంలోని గడేకల్లు గ్రామంలో జూలై 2 నుంచి 4వ తేదీ వరకూ వేముల వాడ భీమలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ మంగళవారం తెలిపారు. జూలై 2న హంచనహాల్ గ్రామం నుంచి భీమలింగేశ్వరస్వామిని అడ్డ పల్లకిలో ఊరేగింపుగా గడేకల్లు గ్రామానికి తీసుకు వస్తామన్నారు. 3వ తేదీ బిందెసేవ, కలశ ప్రతిష్ఠ, 4వ తేదీ మహా రథోత్సవ కార్యక్రమం ఉంటుందన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

కూడేరు: మండలంలోని ఉదిరిపికొండ సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఎస్‌ఐ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఉదిరిపికొండకు చెందిన పోలా రామాంజనేయులు ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం(356 లిక్కర్ బాటిళ్లు) అక్రమంగా తీసుకువస్తూ పట్టుబడ్డాడు. కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ రామానాయుడు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయాలి

బ్రహ్మసముద్రం: అంగన్‌వాడీ కార్యకర్తలు బాధ్యతతో పనిచేయాలని ఐసీడీఎస్ కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ బ్రహ్మసముద్రం సెక్టార్‌ను కంబదూరు ప్రాజెక్టు నుంచి కళ్యాణదుర్గం ప్రాజెక్టులోకి మెర్జ్ చేశామన్నారు. జూలై నుంచి గర్భిణులు, బాలింతలకు ఇంటి వద్దకే నాణ్యమైన అంగన్‌వాడీ సరుకులు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఖాసీంబీ తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్యకు చెక్

రాయదుర్గంటౌన్: 21వ వార్డులోని మారెమ్మగుడి ఏరియాలో కొత్త బోరు వేసి నీటి సమస్యకు అధికారులు, కౌన్సిలర్ డిష్ గోవిందు పరిష్కారం చూపారు. మంగళవారం మారెమ్మగుడి ఏరియాలో కొత్త బోరు వేశారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, కౌన్సిలర్ గోవిందుతోపాటు వైస్ చైర్మన్ శ్రీనివాసయాదవ్, కౌన్సిలర్ షబ్బీర్, ఫక్రుద్దీన్, పెద్ద వన్నూరుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు మంజునాథ, పవన్‌కుమార్ తదితరులు పరిశీలించారు. ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు బోరు వేసి సమస్యను పరిష్కరించిన కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు

తాగునీటి సమస్య పరిష్కారం

బ్రహ్మసముద్రం: మండలంలోని ముప్పలకుంట గ్రామంలోని అంబేడ్కర్ కాలనీలో తాగు నీటి సమస్య తీవ్రంగా ఉంది. పలుమార్లు విన్నవించినా టీడీపీ మద్దతుదారు, స్థానిక సర్పంచ్ పట్టించుకోలేదు. గ్రామస్తులు సమస్యను మంత్రి ఉషశ్రీ చరణ్ దృష్టికి తీసుకు వెళ్లారు. మంత్రి వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారులు , వైఎస్సార్‌సీపీ నాయకులకు ఆదేశించారు. దీంతో మంగళవారం వైస్ ఎంపీపీ వెంకటేష్ నాయక్ అంబేడ్కర్ కాలనీ సమీపంలో ఉన్న పంచాయితీ బోరు బావిలోకి కొత్తమోటర్, పైపులు వేశారు. బోరు నుంచి పుష్కలంగా నీరు వస్తుండంతో కాలనీవాసుల సంతోషం వ్యక్తం చేసి, మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సుబ్బరాయుడు, పంచాయతీ కార్యదర్శి కవిత, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వినోద్, నాయకులు బొజ్జప్ప, నాగేంద్ర, విరుపాక్షి, జానీ, వలంటీర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనంతా దగా, మోసం



జగనన్న సురక్ష కార్యక్రమ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విశ్వ తదితరులు

వజ్రకరూరు: టీడీపీ అధినేత చంద్రబాబు పాలన అంతా ప్రజలను మోసగించడం, దగా చేయడంతోనే సాగిందని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గంజికుంట లో జగనన్న సురక్ష కార్యక్రమంపై అధికారులు అవగాహన సదస్సు ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఎదుర్కొనే దమ్ము లేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నీచ రాజకీయాలు చేస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. సీఎం జగన్‌తోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. రాగులపాడు ఎత్తిపోతల నుంచి ఉప కాలువ నిర్మాణానికి టెండర్లు పిలిచామని, ఈ ప్రక్రియ పూర్తయితే మండలంలోని చాబాల గ్రామానికి సాగు, తాగునీరు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఎన్‌ఎన్‌పీతండా గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరైన రూ.ఎనిమిది లక్షల నిధులతో సిసిరోడ్డు నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచు కవితాభాయి, ఉపసర్పంచు లక్ష్మీభాయి, ఎంపీటీసీ రామక్రిష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ఆయన ఎన్‌ఎన్‌పీతండా గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులపై ఆరా తీశారు. అనంతరం ఎన్‌ఎన్‌పీతండా గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వెంకటానాయక్‌ను మాజీ ఎమ్మెల్యేను పరామర్శించారు. ఇటీవల ఆయన తల్లి రూప్లిభాయి మృతి చెందడంతో.. ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు.

సంక్షిప్త సమాచారం

గోవధ నిషేధించండి

రాయదుర్గం రూరల్: బక్రీద్ పండుగ పేరుతో కొంతమంది గోవధకు సిద్ధపడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి గోవధ నిషేధానికి చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్, గోరక్షక దళం సభ్యులు తహసీల్దార్ మారుతి, ఎస్‌ఐ ప్రసాద్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ అధ్యక్షుడు దేవిరెడ్డిపల్లి రాజేష్, ప్రధాన కార్యదర్శి మద్దిలేటి సత్యనారాయణ, కోశాధికారి అరవా నాగభూషణ, ఉపాధ్యక్షుడు ఘటకారి సాయి, గోరక్షక దళం సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి

బ్రాహ్మణపల్లి: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మండల స్పెషలాఫీసర్ తిప్పేస్వామి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ షకీలాబేగం, ఎంఈఓ మల్లికార్జున సూచించారు. మంగళవారం మండలంలోని కురువల్లి, చంద్రగిరి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను వారు తనిఖీ చేశారు. అనంతరం 'నాడు–నేడు' పనులను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ దేవికి ప్రత్యేక పూజలు

బ్రహ్మసముద్రం: మండలంలోని ఎర్రకొండాపురం గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి నూతన ప్రతిమను తయారు చేయించి, విగ్రహానికి జలాభిషేకం, క్షీరాభిషేకం, విశేషపూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారి ప్రతిమను గ్రామోత్సవం నిర్వహించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన కొల్లాట్ల ఎల్లప్ప కుమారుడు జయరాములు మంగళవారం కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సలహాల మేరకు మెరుగైన చికిత్స కోసం బళ్లారికి తరలించారు. ఘటనపై పాల్తూరు పోలీసులు విచారణ చేపట్టారు.

సొసైటీబ్యాంక్‌లో తక్కువ వడ్డీకే రుణాలు

కూడేరు: సొసైటీ బ్యాంక్‌లో మిగిలిన బ్యాంకుల కంటే తక్కువ వడ్డీతో పంట రుణాలు ఇస్తామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కూడేరు సొసైటీ అధ్యక్షుడు వడ్డే గంగాధర్, డైరెక్టర్లు హనుమంత రెడ్డి, సత్యనారాయణ సూచించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో పంట రుణం పొందిన రైతులకు పశుపోషణకు రూ.60 వేలు రుణం ఇస్తామన్నారు. సొసైటీ బ్యాంక్ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

కూడేరు: పాఠశాల, పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేసినపుడే గుర్తింపు లభిస్తుందని ఎంఈఓలు చంద్రశేఖర్, సాయి కృష్ణ అన్నారు. మండలంలోని పి.నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన టీచర్లు చెన్న కృష్ణమ్మ, ఫహిమున్నిషాను మంగళవారం హెచ్‌ఎం రమణ ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు.

సున్నా వడ్డీ రుణాలతో ఆర్థిక పురోగతి

కుందుర్పి: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు అందిస్తోన్న సున్నా వడ్డీ రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక పురోగతి సాధించాలని ఐకేపీ ఏపీడీ ఈశ్వరయ్య, ప్రాజెక్ట్ మేనేజర్ రాధారాణి సూచించారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో మహిళా సంఘాలతో సున్నా వడ్డీ రుణాలు, బకాయిల చెల్లింపు, సోషల్ మొబలైజేషన్, సంక్షేమ పథకాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో హెడీ ఏపీఎం శ్రీనివాసులు, ఏపీఎం హుసేన్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, కార్యదర్శి సుశీలమ్మ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన అధికారిగా కృష్ణతేజ

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం వ్యవసాయ డివిజన్ (కళ్యాణదుర్గం, బెళుగుప్ప, బ్రహ్మసముద్రం) మండలాల ఉద్యాన శాఖ అధికారిగా ఎం.కృష్ణతేజ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న హార్టికల్చర్ అధికారి ధనుంజయ బదిలీ కావడంతో ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా రాజంపేటలో పనిచేస్తున్న కృష్ణతేజను ఇక్కడికి బదిలీ చేశారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ లక్ష్మణ్

రాయదుర్గంటౌన్: ముస్లింల పర్వదినమైన బక్రీద్ (ఈదుల్ అజ్హ) త్యాగానికి ప్రతీకగా జరుపుకుంటారు. ముస్లింలకు ఏడాదిలో రెండు ప్రధాన పండుగలు. ఒకటి రంజాన్ కాగా మరొకటి బక్రీద్. ముస్లింలు గురువారం పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. ప్రళయ దినం రోజు దాకా బక్రీద్ పండుగ రోజున ఆర్థిక శక్తి గలిగిన ప్రతి ఒక్కరూ పొట్టేళ్లను జుబా చేసి దైవ ప్రవక్త హజరత్ ఇబ్రహీం(సొ), ఆయన కుమారుడి త్యాగాన్ని స్మరించుకోవాలని హదీస్, ముస్లింల పవిత్ర గ్రంథమైన ఖురాన్ తెలుపుతోంది.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలోజరుపుకోవాలని అర్బన్ సీఐ లక్ష్మణ్ సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. పండుగను ప్రశాంత వాతావరణానికి భంగం వాటిల్లకుండా సంయమనంతో జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ సైఫుల్లా, మత పెద్దలు, వివిధ మసీదుల ప్రతినిధులు పాల్గొన్నారు.

గోవధ నిషేధం

ఉరవకొండ: ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగలో గోవధ నిషేధించామని ఉరవకొండ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వెంకటేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గోవధ నిషేధ చట్టం–1977, జంతు హింస నిరోధక చట్టం–1960 ప్రకారం గోవధ నిషేధించామన్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ గౌతమి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారన్నారు. బక్రీద్ సందర్భంగా పశువులు, గేదె, లేగదూడలు, ఒంటెలను బలి ఇవ్వడం నిషేధమన్నారు. ఒక వేళ బలి ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నిర్ణీత వేళకు ఈద్ నమాజ్‌కు హాజరుకావాలి

రాయదుర్గంలో గురువారం ఈదుల్ అజ్హ(బక్రీద్) పండుగ జరుపుకోనున్నట్లు ప్రభుత్వ ఖాజీలు కేఎండీ సైఫుల్లా, అతావుర్ రహిమాన్ తెలిపారు. నిర్ణీత వేళకన్నా అరగంట ముందుగానే ముస్లిం సోదరులు ఈద్గాలకు చేరుకుని నమాజ్ ఆచరించాలని సూచించారు. బీటీపీ రోడ్డు(బైపాస్) మైదానంలో ఉదయం 7 గంటలు, కణేకల్లు రోడ్డు మైదానంలో ఉదయం 7.15 గంటలు, బళ్లారి రోడ్డు వద్ద ఉన్న మైదానంలో ఉదయం 8 గంటలకు నమాజ్ ప్రారంభమవుతుందన్నారు.

– ప్రభుత్వ ఖాజీలు సైఫుల్లా, అతావుర్ రెహమాన్